క్లుప్తంగా

సబ్‌స్టేషన్‌లో షార్ట్ సర్క్యూట్

● తప్పిన ప్రమాదం



చిట్యాల: మండల కేంద్రంలోని సబ్ స్టేషన్‌లో సోమవారం కెపాసిటర్ పేలి షార్ట్ సర్క్యూట్ అయింది. దీంతో మంటలు ఎగసిపడి పరికరాలు దగ్ధమయ్యాయి. అక్కడే ఉన్న సిబ్బంది వెంటనే మంటలు ఆర్పివేశారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామల్లో మూడు గంటలు విద్యుత్ నిలిచిపోయింది. ఏఈ చంద్రశేఖర్ సబ్‌స్టేషన్‌లో జరిగిన సంఘటనను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం సిబ్బందిని పిలిచి మరమ్మతులు చేయించి విద్యుత్ సరాఫరా చేశారు.

రేపు మహాసభ

భూపాలపల్లి రూరల్: జిల్లా కేంద్రంలో రేపు (బుధవారం) ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మహాసభను నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ అంబాల చంద్రమౌళి, సీనియర్ నాయకుడు నోముల శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ మహాసభకు పద్మశ్రీ అవార్డు గ్రహీత, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హాజరు కానున్నారని తెలిపారు. మాదిగ ఉపకులాలకు 11శాతం రిజర్వేషన్ ఇవ్వాలనే డిమాండ్‌తో మందకృష్ణ మాదిగ మరో పోరాటానికి తెరలేపారన్నారు. వేలాది కార్యకర్తలతో కళాకారులతో మహా ప్రదర్శన చేయడానికి మాదిగలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

కలప వాహనం పట్టివేత

కాళేశ్వరం: తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు గుండా టేకు కలప తరలిస్తున్న వాహనాన్ని మహారాష్ట్ర అటవీశాఖ అధికారులు వెంబడించి చేసి మహదేవపూర్ మండలం కాళేశ్వరం అంతరాష్ట్ర వంతెన వద్ద పట్టుకున్నారు. తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం రాత్రి గడ్చిరోలి జిల్లా సిరొంచ వైపు నుంచి కలపతో బొలేరా వాహనం చెక్‌పోస్టు వద్ద ఆపకుండా తెలంగాణలోకి వస్తుండగా, అక్కడి అటవీశాఖ అధికారులు చేసి పట్టుకున్నారు. కాగా, బొలేరా వాహనం వదిలేసి కలపతరలిస్తున్న ఇద్దరు వ్యక్తులు పరారయ్యారు. తెలంగాణ రిజ్స్రేషన్ గల కలపతో ఉన్న వాహనాన్ని సిరొంచ రేంజ్‌కు తరలించినట్లు తెలిసింది. రూ.లక్ష విలువైన కలప ఉన్నట్లు సమాచారం. నిఘా లేకపోవడంతో నిత్యం రాత్రి వేళల్లో కలప తరలిపోతున్నట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు.

రైతులకు పరిహారం చెల్లించాలి

వెంకటాపురం(కె) : వెంకటాపురం, వాజేడు మండలాల్లో బాండ్ మొక్కజొన్న సాగుచేసి నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని ఆదివాసీ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో వ్యవసాయ సహాయ సంచాలకులు అవినాష్ వర్మకు సో మవారం వ్యవసాయ శాఖ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మొక్కజొన్న కంపెనీ ఆర్గనైజర్లు రాజకీయ పార్టీలను అడ్డుపెట్టుకొని రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. రైతులకు న్యాయం చేయకపోతే పోరుబాట పడతామని వినిలో పేర్కొన్నారు. వినతిపత్రం అందించిన వారిలో ఆదివాసీ సంఘాల నాయకులు ఉయిక శంకర్, పూనెం సాయి, నర్సింహామూర్తి తదితరులు ఉన్నారు.

యూరియా అందించాలి

ములుగు రూరల్: యాసంగి సాగులో రైతులకు అవసరమయ్యే యూరియాను సకా లంలో అందించాలని తెలంగాణ రాష్ట్ర రై తుసంఘం జిల్లా కన్వీనర్ ఎండి.అమ్జద్‌పాషా అన్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా వ్యవసాయ అధికారి సురేష్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సాగు అవుతున్న వ రి, మొక్కజొన్న పంటలకు యూరియా అ వసరం కాగా కొరత కారణంగా రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించి అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. జిల్లాలో యాసంగి సాగులో సాగైన పంటకు అనుగుణంగా యూరియా సరఫరా చేయాలని డి మాండ్ చేశారు. నాయకులు ముత్యాల రాజు, రాజమౌళి, సాంబయ్య, నటరాజ్ పాల్గొన్నారు.

బాలికలకు ఆత్మరక్షణ విద్య అవసరం

వెంకటాపురం(కె): బాలికలకు ఆత్మరక్షణ విద్య ఎంతో అవసరమని సీఐ బండారి కుమార్ అన్నారు. మేడారంలో జరిగిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఆయన అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో మండలం నుంచి 89 మంది విద్యార్థులు పాల్గొనగా వారిలో 56 మంది గోల్డ్‌మెడల్, 20 మంది సిల్వర్, 13 మంది బ్రాంజ్ మెడల్ సాధించి తమ ప్రతిభను చాటారు. ప్రతిభను కనపరిచిన విద్యార్థులను సోమవారం పోలీస్ స్టేషన్ ఆవరణలో సీఐ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలికలు కరాటే నేర్చుకుంటే తమను తాము రక్షించుకోవటంతో పాటు ఆత్మస్థైర్యంగా ఉంటారని అన్నారు. కార్యక్రమంలో ఎస్సై కొప్పుల తిరుపతి రావు, కరాటే మాస్టర్లు సూర్యనారాయణ, హనుమంతు, రామరావుతో పాటు తదితరులు ఉన్నారు.

పింఛన్ కోసం ఎదురుచూపు

● నాలుగేళ్లుగా మంజూరు కాని ఆసరా పింఛన్లు
● ఇబ్బంది పడుతున్న వితంతువులు, వృద్ధులు



రేగొండ ఎంపీడీఓ కార్యాలయం

రేగొండ: రేగొండ, కొత్తపల్లిగోరి మండలాల్లో ఆసరా పింఛన్ల కోసం వందల మంది ఎదురుచూస్తున్నారు. నాలుగు సంవత్సరాలుగా ఆసరా పింఛన్ పథకం అమలు చేయకపోవడంతో లబ్ధిదారులు పింఛన్‌కు దురమయ్యారు. అప్పటి నుంచి వారు ఎదురు చూస్తున్న నూతన ప్రభుత్వం ఏర్పాటుతో మళ్లీ ఆశలు చిగురించాయి. కానీ ప్రభుత్వం ఏర్పాటై ఏడాది దాటినా ఆసరా పింఛన్ పథకం ఊసు లేకపోవడంతో వితంతువులు, దివ్యాంగులు వృద్ధులు ఆందోళన చెందుతున్నారు.

దరఖాస్తులతో సరి

గత ప్రభుత్వం నూతనంగా వితంతువులకు, దివ్యాంగులకు ఆసరా పింఛన్ అందించడంలో నిర్లక్ష్యం చేసింది. కొన్ని సమయంలో గ్రామ పంచాయతీల ద్వారా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించారు. కానీ వారికి మాత్రం ఆసరా పింఛన్ అమలు చేయలేదు. మరోసారి ఆన్‌లైన్‌లో 57 సంవత్సరాలు వయస్సు నిండిన వారికి దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించిన వితంతువులకు మాత్రం ఇవ్వలేదు. దీంతో వృద్ధాప్య పింఛన్ మాత్రమే మంజూరైంది. వితంతు పింఛన్ మంజూరు కాలేదు. కొత్త పింఛన్ల మంజూరులో శ్రద్ధ చూపని ప్రభుత్వం ఏ ఇంట్లోనైనా పింఛన్ అందుకునే వృద్ధుడు మృతి చెందితే అతడిది రద్దు చేసి భార్యకు వితంతు పింఛన్ కింద మార్చి ఇస్తున్నారు. కానీ కొత్తవి మాత్రం ఇవ్వడం లేదు.

నాలుగు సంవత్సరాలుగా..

నాలుగేళ్లుగా కొత్త వాటికి మంజూరు ఇవ్వకపోవడంతో దరఖాస్తులు పెట్టుకున్న వారు ఆర్థిక చేయూత లేక ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు నిత్యం కార్యాలయాలు, రాజకీయ నాయకుల ఇళ్ల చుట్టూ తిరుగుతున్నారు. నూతన ప్రభుత్వం వచ్చి సంవత్సరం గడుస్తున్నా ఆసరా పథకం అమలు చేయకపోవడంతో అర్హులు ఎదురుచేస్తున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం రేషన్‌కార్డులు, ఇళ్లు మంజూరు చేశారు. కానీ ఆసరా పథకం ద్వారా పింఛన్ కోసం లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు మాత్రం తీసుకోకపోవడంతో ఇప్పట్లో పింఛన్ ప్రభుత్వం ఇచ్చే యోచనలో లేనట్లు తెలుస్తుంది. ప్రస్తుతం రేగొండ, కొత్తపల్లిగోరి మండలాల్లో 9157 పింఛన్లు వస్తుండగా వందల సంఖ్యలో లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు. తమ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఆసరా పింఛన్ మంజూరు చేయాలని వారు కోరుతున్నారు.

రేగొండ, కొత్తపల్లిగోరి మండలాల్లో ఆసరా పింఛన్ లబ్ధిదారుల వివరాలు

వృద్ధులు	4049
వితంతువులు	3199
దివ్యాంగులు	1161
గీత కార్మికులు	386
చేనేత	170
ఒంటరి మహిళలు	163
బీడీ కార్మికులు	29

పింఛన్ అందించాలి



నా భర్త మూడు సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో వితంతు పింఛన్ కోసం అప్పటి నుంచి ప్రతిసారి దరఖాస్తు చేసుకునే ఉన్నా కానీ ఇప్పటి వరకు అమలు చేయడం లేదు. ఇంటికి పెద్ద దిక్కయిన భర్త మృతితో బతుకు కష్టంగా మారింది. ఎలాంటి ఆధారం లేక కూలి పని చేసుకుంటున్నా. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆసరా పింఛన్ అందించాలి.

– నూనేటి ఆగక్క, కొత్తపల్లిగోరి

దరఖాస్తులు ఇవ్వొచ్చు



ఆసరా పథకం కింద అర్హులు దరఖాస్తులను గ్రామపంచాయతీ కార్యాలయాలలో ఇవ్వొచ్చు. గతంలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు కూడా పింఛన్ పథకం అమలు చేస్తాం. ప్రభుత్వం ఆదేశించి సైట్ తెరవగానే వివరాలు నమోదు చేస్తాం.

– వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ, రేగొండ

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం..

● ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



మొగుళ్లపల్లి: పరామర్శిస్తున్న ఎమ్మెల్యే గండ్ర

మొగుళ్లపల్లి: బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండల కేంద్రానికి చెందిన అరికాంతపు రాజు ఇటీవల ఆత్మహత్య చేసుకున్నాడు. అలాగే బండారి బీమయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించి భరోసా కల్పించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వర్లపల్లిలో..

రేగొండ: కొత్తపల్లిగోరి మండలంలోని వెంకటేశ్వర్లపల్లి గ్రామానికి చెందిన బండారి రవి ఇటీవల అప్పుల బాధలు భరించలేక పురుగుమందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పరామర్శించారు. ఆయన వెంట భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గూటోజు కిష్టయ్య, నాయకులు సూదనబోయిన ఓంప్రకాష్, చిగురుమామిడి కుమారస్వామి, రాజు, పత్తి తిరుపతి ఉన్నారు.

మోడల్ స్కూల్‌లో నాణ్యమైన విద్య



ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

మొగుళ్లపల్లి: మోడల్ స్కూల్‌లో నాణ్యమైన విద్య లభిస్తుందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు సోమవారం మండలంలోని మొగుళ్లపల్లి, ఇస్సిపేట, అంకుషాపూర్, మేదరమెట్ల గ్రామాల్లో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలోని కొర్కిశాల మోడల్ స్కూల్‌లో అడ్మిషన్ల కోసం మార్చి 10 వరకు గడవు పొడిగించారని తెలిపారు. 6వ తరగతిలో 100 సీట్లకు, ఏడు నుంచి 10వ తరగతుల్లో మిగిలిన సీట్లకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ప్రిన్సిపాల్ తాళ్లపెల్లి రాకేశ్, ఉపాధ్యాయులు అనురేష్, శ్యాం కుమార్, కిషోర్, అరుణ, రాజ్‌కుమార్, కుమార్, కిరణ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

రేగొండ: కొత్తపల్లిగోరి మండలంలోని చిన్నకోడేపాక గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2002–03 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 22 ఏళ్ల తర్వాత ఒక్కచోట కలుసుకుని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. చదివిన బడి, పరిసరాలను చూసి భావోద్వేగానికి గురయ్యారు. పాఠాలు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు సాంబలింగాచారి, నరేందర్ రెడ్డి, యాదగిరి, జితేందర్, దేవేందర్ రెడ్డి, సురేష్, యాసీన్, సత్యనారాయణ, కొమురరెడ్డి, కుమారస్వామి, లక్ష్మీ, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

వేసవిలో జాగ్రత్తలు తీసుకోవాలి

● పీహెచ్‌సీ వైద్యాధికారి చీర్ల శ్రీకాంత్



వెంకటాపురం(ఎం : గొత్తికోయలతో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీకాంత్

వెంకటాపురం(ఎం): అటవీ ప్రాంతంలో నివసిస్తున్న గొత్తికోయలు వేసవికాలంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి చీర్ల శ్రీకాంత్ తెలిపారు. మండల కేంద్రానికి 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న తౌర్రిచింతలపాడు గొత్తికోయగూడేనికి ట్రాక్టర్‌లో వైద్యసిబ్బందితో కలిసి వెళ్లారు. గొత్తికోయగూడెంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి అందరిని పరీక్షించి 45 మంది నుంచి రక్తన మూనాలు సేకరించారు. గర్భిణులకు, చిన్న పిల్లలకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ దోమల బెడద ఎక్కువగా ఉన్నందున దోమ తెరలు వాడాలని సూచించారు. ఎవరికైనా అనారోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే ఆరోగ్య కార్యకర్తలను, ఏఎన్‌ఎంలను సంప్రదించాలని సూచించారు. గొత్తికోయలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ నవీన్, సీహెచ్‌ఓ దుర్గారావు, ఏఎన్‌ఎంలు అనురాధ, స్వప్న, ఆశా కార్యకర్తలు సరోజన, మాధవి, సౌజన్య, ఇందిర, కవిత, సంపూర్ణ, శోభ పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్యపరీక్షలు

వాజేడు : మండలంలోని పేరూరు ప్రాథమిక ఆ రోగ్య కేంద్రంలో సోమవారం గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. పేరూరు వైద్యశాల పరిధిలో ఉన్న గర్భిణులను వైద్యశాలకు తీసుకొచ్చి రక్త, ఇతర పరీక్షలలు నిర్వహించారు. రక్తం తక్కువగా ఉ న్న వారికి ఇంజక్షన్ ఇచ్చారు. గర్భిణీగా ఉన్న సమయంలో తీసుకోవాల్సిన పోషక ఆహారం గురించి వారికి వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఈఓ వేణుగోపాల్ కృష్ణ, నర్సింగ్ ఆఫీసర్ రమ, రమాదేవి, ఏఎన్‌ఎం శకుంతల, అశ్విని పాల్గొన్నారు.

టేకు కలప వేలం

● రూ.9.09లక్షల ఆదాయం

కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ కలప డిపోలోని టేకు కలపను డీఎఫ్‌ఓ నవీన్‌రెడ్డి ఆదేశాలతో సోమవారం వేలంపాట నిర్వహించినట్లు రేంజర్ ఆర్.రవి తెలిపారు. ఈ వేలం పాటకు 10 మంది హాజరై 12 టేకు కలప లాట్లు కొనుగోలు చేసినట్లు తెలిపారు. దీంతో రూ.9.09లక్షల ఆదాయం వచ్చినట్లు వెల్లడించారు.

నియామకం



నియామక పత్రం అందజేస్తున్న రవి

టేకుమట్ల: మండలంలోని అంకుషాపూర్ బీఆర్‌ఎస్ గ్రామ కమిటీని నియమించినట్లు మండల అధ్యక్షుడు సట్ల రవి తెలిపారు. అధ్యక్షుడిగా గిరవెన భాస్కర్, ఉపాధ్యక్షులుగా మేకల శ్రీకాంత్, కూకట్ల రమేశ్, ప్రధానకార్యదర్శిగా చిలుక రమేశ్, సంయుక్త కార్యదర్శిగా రవీందర్ రెడ్డి, ఓదెలు, సురేందర్, కోశాధికారిగా ఐలయ్య, ప్రచార కార్యదర్శిగా సందీప్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బందెల నరేష్, మాజీ ఎంపీటీసీ పింగిలి వెంకటేశ్వర్‌రెడ్డి, పోతనవేన ఐలయ్య, నాయకులు లింగారెడ్డి, లక్ష్మణ్, రాజు, కుమార్, ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

గోవులను తరలిస్తున్న ముఠా అరెస్ట్

ఏటూరునాగారం : రెండు రోజుల క్రితం అక్రమంగా గోవులను తరలిస్తున్న ముఠాను పట్టుకున్నందుకు స్థానిక సీఐ శ్రీనివాస్, ఎస్సై తాజుద్దీన్‌లను బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు చక్రవర్తి మాట్లాడుతూ గోవులను హిందువులు ఎంతో ఆరాధ్య దైవంగా పూజిస్తారన్నారు. అలాంటి మూగజీవాలను కొంతమంది ముఠాగా ఏర్పడి దూర ప్రాంత వ్యాపారస్తులకు విక్రయించడానికి తరలిస్తున్నారని అన్నారు. మూగజీవాలను తరలిస్తున్న వాహనాలను స్థానిక పోలీసులు పట్టుకొని గోశాలలకు తరలించి తిరిగి వాటికి ప్రాణంపోయడం హర్షించదగ్గ విషయం అన్నారు. కార్యక్రమంలో బీజేపీ దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు గండేపల్లి సత్యం పాల్గొన్నారు.

పశువులను పట్టుకున్న పోలీసులు

ఏటూరునాగారంలోని ఐటీడీఏ వద్ద సోమవారం ఉదయం పోలీసులు ఎస్సై తాజొద్దీన్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఒక బొలెరో వాహనంలో 11 పశువులను అక్రమంగా ఏటూరునాగారం నుంచి హనుమకొండ వైపు తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. ఎద్దులను ఒకదానిపై ఒకటి కట్టివేసి ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా పశువులకు మేత లేకుండా తరలించడంపై డ్రైవర్ మౌర్య శ్రీహరి, ఓనర్ ఇస్లావత్ బాబులపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. వాటిని రాంపూర్‌లోని గోశాలకు తరలించామని ఎస్సై తెలిపారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది



ఏటూరునాగారం: ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైందని జెడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయుడు సాంబశివరావు అన్నారు. సోమవారం స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో 10వ తరగతి విద్యార్థులు స్వయంపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా ని ర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులు గా, ఉన్నతాధికారులుగా పాత్ర పోషించి తోటి విద్యార్థులకు చదువును బోధించారు. హెచ్‌ఎంగా ఐశ్వరయ్య, కలెక్టర్‌గా శరణ్య, డీఈఓగా ఇమ్రాన్, ఆర్‌జేడీగా వెంకటసాయి, డిప్యూటీ ఈఓగా రాంచరణ్, ఎంఈఓగా రాజేష్‌లు వ్యవహరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాన్ని శుభ్రంగా ఉంచుకోవాలి

● జిల్లా వైద్యాధికారి మధుసూదన్



వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న మధుసూదన్

రేగొండ: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా వైద్యాధికారి మధుసూదన్ అన్నారు. మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలోని ల్యాబ్, మందులు నిల్వ చేసే గది, పలు రికార్డులను ఆయన తనిఖీ చేశారు. గర్భిణుల వివరాల నమోదు, ఓపీ తదితర విషయాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిబ్బంది సమయానికి హాజరుకావాలని సూచించారు. గ్రామాల్లో వైద్యసిబ్బంది దీర్ఘకాలిక పేషంట్లకు పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేయాలన్నారు. సిబ్బంది తీసుకోవాల్సిన పలు విషయాలపై సూచనలు చేశారు. మార్చి31 లోపు ఎన్‌సీడీ ప్రోగ్రాంను వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారిని హిమబిందు, సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానితులకు ఆశ్రయం ఇవ్వొద్దు



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై పవన్‌కుమార్

● ఎస్సై పవన్‌కుమార్

కాళేశ్వరం: అనుమానితులకు ఆశ్రయం ఇవ్వొద్దని మహదేవపూర్ ఎస్సై పవన్‌కుమార్ అన్నారు. సోమవారం మహదేవపూర్ మండలం ఎన్కపల్లి గ్రామంలో సిబ్బందితో కలిసి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో ఇంటింటా క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వాహన పత్రాలను పరిశీలించారు. నంబర్ ప్లేటు లేని వాహనాలను గుర్తించి వాటికి జరిమానా విధించారు. అనంతరం గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణకు అందరూ సహకరించాలని, మద్యం తాగి వాహనాలు నడపొద్దన్నారు. మహదేవపూర్, కాటారం మండలాల పరిధి అడవులలో పెద్దపులి సంచరిస్తుందని ఫారెస్ట్ అధికారులు గుర్తించినందున గ్రామస్తులు అడవుల్లోకి వెళ్లొద్దని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సివిల్ పోలీసులు, హెడ్‌కానిస్టేబుల్ పున్నం, కానిస్టేబుల్స్ చంద్రమోహన్, తిరుపతి, టీజీఎస్‌ఎస్ పోలీసులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గుడుంబా పట్టివేత

ఎన్కపల్లి గ్రామంలో గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు. గ్రామానికి చెందిన శ్రీశైలం ఇంట్లో గుడుంబా నిల్వ ఉంచినట్లు తెలిసిన సమాచారం మేరకు తనిఖీ చేసి 10లీటర్ల గుడుంబాను పట్టుకున్నట్లు తెలిపారు. ఈ మేరుకు అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న అధికారులు

టేకుమట్ల: ప్రజాపాలనలో భాగంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులతో కలిసి అధికారులు సోమవారం ఇళ్ల నిర్మాణాలకు ముగ్గు పోసి పనులు ప్రారంభించారు. మండల కేంద్రానికి చెందిన లబ్ధిదారురాలు కొలుగూరి ప్రియాంకకు అధికారులు ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ముగ్గు పోసి నిర్మాణ విధానాన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ లోకిలాల్, ఎంపీడీఓ అనిత, హౌసింగ్ ఏఈ రాజలింగం, ఎంపీఓ సురేశ్ పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్‌తో విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం

● ఎంఈఓ దేవానాయక్



ప్రశ్నపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ, ఎస్సై

భూపాలపల్లి అర్బన్: టాలెంట్ టెస్ట్‌తో విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెరుగుతుందని ఎంఈఓ దేవానాయక్ తెలిపారు. ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని మాంటిస్సోరి హైస్కూల్‌లో నిర్వహించిన టాలెంట్ టెస్ట్ ప్రశ్నపత్రాల ఆవిష్కరణకు ఎంఈఓ దేవానాయక్, స్థానిక ఎస్సై శ్రీలత హాజరై పరీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వార్షిక పరీక్షలపై ఉన్న భయాన్ని తొలగించేందుకు టాలెంట్‌టెస్ట్ విద్యార్థులకు ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోత్కు ప్రవీణ్‌కుమార్, నాయకులు రమేశ్, జోసెఫ్, సతీష్, సుధాకర్‌రెడ్డి, శ్రీకాంత్, సాయికృష్ణ, అజయ్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న పున్నం రవి

రేగొండ: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆ పార్టీ జిల్లా నాయకుడు పున్నం రవి అన్నారు. సోమవారం కొడవటంచలో కొడవటంచ, గూడెపల్లి, జోగయ్యపల్లి గ్రామాల పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా పని చేయాలని అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాలు అర్హులకు చేరే విధంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాయిని సంపత్ రావు, పట్టెం శంకర్, పబ్బ శ్రీనివాస్, కోయిల క్రాంతి, కొమురాజు భాస్కర్, పున్నం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలు ఉదయం వేళల్లో నిర్వహించాలి

చిట్యాల: పదో తరగతి విద్యార్థులకు ఉదయం పూటనే ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించాలని ఏబీవీపీ చిట్యాల నగర కార్యదర్శి బుర్ర అభిజ్ఞ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అభిజ్ఞ మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం రంజాన్ పేరుతో పదో తరగతి ప్రీ ఫైనల్ పరీక్ష వేళల్లో మార్పులు చేస్తూ ఎస్సీఈఆర్టీ తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నామని అన్నారు. ఈ నెల 6న నుంచి నిర్వహించే పదో తరగతి ప్రీ ఫైనల్ పరీక్షలు మధ్యాహ్నం 12.15, నుంచి 3.15 వరకు సమయం నిర్ణయిస్తూ స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ సర్క్యూలర్‌ను రిలిజ్ చేయడం సరికాదని అన్నారు. విద్యార్థులకు ఉదయమే పరీక్షలు నిర్వహించాలని కోరారు. అనంతరం మండల కేంద్రంలో ఎంఈఓ కోడెపాక రఘుపతికి వినతిపత్రం అందజేశారు. నాయకులు రాజేశ్, రాజు, తదితరులు పాల్గొన్నారు.